క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ డ్రైవ్

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి, కోటపాలెం, వెల్పురాయి, కోష్ట, యర్రవరం గ్రామ సచివాలయాల్లో మంగళవారం ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 28 వరకు ఎంపిక చేసిన గ్రామ సచివాలయాల్లో ఆధార్ డ్రైవ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఆరేళ్లలోపు చిన్నారులకు కొత్త ఆధార్ నంబర్, మిగిలిన వారికి అడ్రస్, పేరు వంటి మార్పులు చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమయపాలన తప్పనిసరి


ఇంజినీరింగ్ బ్లాక్‌లో ల్యాబ్ వర్కు పరిశీలిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: బోధన సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో సోమవారం సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్ క్లాస్ వర్కును పరిశీలించారు. షెడ్యూల్ మేరకు తరగతులు, ల్యాబ్ నిర్వహణ జరగాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం మెరుగ్గా ఉండాలని చెప్పారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులు పక్కాగా ఉండాలన్నారు. సమస్య వస్తే తక్షణం మరమ్మతులు చేయాలని సిబ్బందికి సూచించారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే చర్యలు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో

రణస్థలం: మండలంలోని ముక్తంపురం గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్-58లోని ప్రభుత్వ భూమి(కొండ పోరంబోకు)లో ఎటువంటి ఆక్రమణలు చేసినా, అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపినా చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.ప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు కొండ ములగాం గ్రామ రెవెన్యూ అధికారి ఎల్.వి.అప్పలనాయుడు సంబంధిత స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

సేవలతోనే గుర్తింపు


కృష్ణచంద్‌ను సన్మానిస్తున్న పీపీలు, ఏపీపీలు


శ్రీకాకుళం పాతబస్టాండ్: విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని వక్తలు పేర్కొన్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్‌ను జిల్లా కోర్టు ప్రాంగణంలోని ప్రాసిక్యూషన్ కార్యాలయంలో పలువురు పీపీలు, ఏపీపీలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలు కొనియాడారు. ఏకకాలంలో 8 జిల్లా సెషన్స్ కోర్టులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కృష్ణచంద్ సేవలందించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమానికి సీనియర్ అసిస్టెంట్ పీపీలు లోలుగు నాగభూషణరావు, పి.సుశీల, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు చింతాడ సత్యనారాయణ, కింజరాపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం


విష్ణుమూర్తినాయుడును సత్కరిస్తున్న కార్యకర్తలు

జి.సిగడాం: పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తినాయుడు అన్నారు. సోమవారం ఆనందపురంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పల్లెల్లో రోడ్లు, కాలువల నిర్మాణం జోరుగా సాగుతోందన్నారు. సమావేశంలో బూరాడ వెంకటరమణ, వజ్జిపర్తి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: జరజాం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్సై వి.సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్, వాహనపత్రాలు పరిశీలించారు. అనంతరం బట్నవానిపేటలో సంకల్పం సదస్సు నిర్వహించి మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గంజాయి సరఫరా వంటి ఘటనలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

రిమ్స్ హాస్టల్లో..
కాలకృత్యాలకూ కష్టాలే!

- అధ్వానంగా మరుగుదొడ్లు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- పురుషుల వసతి గృహంలో 64కు గాను వినియోగంలో ఉన్నవి మూడే
- మహిళా వసతి గృహంలో 64కు గాను ఎనిమిదే వినియోగం

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల హాస్టల్ భవనాల్లో మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. పురుషుల వసతి గృహంలో 64 మరుగుదొడ్లు ఉండగా, మూడు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. బాలికల వసతి గృహంలో 64 మరుగుదొడ్లకు గాను ఎనిమిదింటిని మాత్రమే వినియోగిస్తున్నారు. మిగిలినవన్నీ దారుణంగా తయారయ్యాయి. ఈ విషయమై రిమ్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం లేకుండాపోతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని మరమ్మతులు చేయాల్సిన బాధ్యత ఏపీహెచ్ఎంహెచ్ఐడీసీ అధికారులపై ఉందని చెబుతూ అధికారులు తప్పించుకుంటున్నారు. ఫలితంగా ఆరువందల మంది యూజీ, పీజీ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఉదయం 8 గంటలకే తరగతులు ప్రారంభమవుతుండగా, విద్యార్థులంతా కాలకృత్యాలు తీర్చుకునేందుకు అవకాశం లేకుండా పోతుంది. కొందరు విద్యార్థులు స్నానాలు చేయకుండా, కాలకృత్యాలు తీర్చుకోకుండా తరగతులకు హాజరై మధ్యలో మరుగుదొడ్లు వినియోగించుకుంటున్న పరిస్థితి సైతం నెలకొంటోంది. అక్కడ కూడా కొంతమేర మరమ్మతులు లేక ఇబ్బంది కలిగిస్తున్నాయి. రిమ్స్ ఆసుపత్రిలో మరుగుదొడ్లు మరింత దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయి.


రిమ్స్‌లో హాస్టల్ భవనం

వసతికీ ఇబ్బందే..

వైద్య విద్యార్థులు వసతికి కూడా ఇబ్బంది పడుతున్నారు. పీజీ విద్యార్థుల హాస్టల్ భవనం పూర్తి కాకపోవడంతో ఆస్పత్రిలోని ఓ ఫ్లోర్‌లో 28 గదులను పీజీ విద్యార్థుల హాస్టల్ కోసం కేటాయించారు. వీటిలో నాలుగు గదులు ఆర్ఎంవోల ఆధీనంలో ఉన్నాయి. మిగిలి ఉన్న 24 గదుల్లో రెండు వందల మంది విద్యార్థులు ఉంటున్నారు. ఒక్కో గదిలో తొమ్మిది నుంచి పది మంది విద్యార్థులు ఉంటున్నారు.

తాగునీటికి అవస్థలు..

విద్యార్థులు తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్ ఉన్నా సరైన నిర్వహణ లేక పనిచేయడం లేదు. దాతలు నిర్వహణకు నిధులు ఇచ్చినా మరమ్మతులు చేసే వారే కరువయ్యారు. దీంతో విద్యార్థులు బయటి నుంచి ఇరవై లీటర్ల మినరల్ వాటర్ బాటిళ్లు తెప్పించుకొని దాహార్తి తీర్చుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.


మురుగు, వ్యర్థాలతో నిండిన కమోడ్


తాగునీటి కోసం విద్యార్థులు కొనుగోలు చేసిన వాటర్ క్యాన్లు

పారిశుద్ధ్య పనుల లోపం వల్లే..

మరుగుదొడ్లు అధ్వానంగా మారడానికి పారిశుద్ధ్య పనుల నిర్వహణ లోపమే కారణం. సరిగ్గా చేయించాలని రిమ్స్ అధికారులకు సూచించాం. మరుగుదొడ్ల మరమ్మతులకు నిధులు వచ్చాయి. అయితే హాస్టల్ భవనాలు ఖాళీగా లేకపోవడం వల్ల మరమ్మతులు చేయించలేకపోతున్నాం. ఈ నెలాఖరులో భవనాలు ఖాళీ అవుతాయయి. అప్పుడు మరమ్మతులు పూర్తి చేయిస్తాం.

– సత్య ప్రభాకర్, ఈఈ, ఏపీహెచ్ఎంహెచ్ఐడీసీ

సమస్యలు పరిష్కరించండి మహాప్రభో


ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గార: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ల ప్రాజెక్టు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. శాలిహుండం వద్ద ఉన్న గార ప్రాజెక్టు ఆవరణ, గార–చింతాడ రోడ్డుపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.పద్మలత, జె.కామేశ్వరి తదితరులు మాట్లాడుతూ సీబీ ఈవెంట్స్ నగదు చెల్లించాలని, సీఎఫ్ఎంఎస్ తొలగించని కారణంగా ఉచిత గ్యాస్ పథకం అందక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, విద్యుత్ బిల్లు, రవాణా ఖర్చులు, మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రాలకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని కోరారు. అనంతరం ప్రాజెక్టు అధికారులకు వినతి పత్రం అందించారు. నిరసన కార్యక్రమంలో గార, శ్రీకాకుళం రూరల్ పరిధిలోని 170 మంది కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు.ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కనీసం వేతనం రూ. 26 వేలకు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామన్న ప్రభుత్వం నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు, ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు పైడి విజయలక్ష్మి, నాయకులు యు.శారదాకుమారి, కె.ధనలక్ష్మి, సీహెచ్ మౌళి, ఎం.రాధిక తదితరులు పాల్గొన్నారు.


గార: ప్రాజెక్టు కమిటీ వద్ద బైఠాయించిన అంగన్‌వాడీలు

చోడి సాగుపై రైతుల మక్కువ


ఎచ్చెర్లలో సాగు చేస్తున్న చోడి పంట

ఎచ్చెర్ల క్యాంపస్ : మండలంలో చోడి(రాగి) పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎచ్చెర్ల, చిలకపాలెం, కేశవరావుపేట, ధర్మవరం, పొన్నాడ వంటి ప్రాంతాల్లో విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రాగి పిండితో చేసే ఆహార పదార్థాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. డయాబెటిక్, హైపర్ టెన్షన్ వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు రాగితో తయారు చేసిన ఆహార పదార్థాలు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా చోడి సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

రబీ పనుల్లో రైతులు బిజీ


పూసర్లపాడు వద్ద ఉభాలు చేస్తున్న మహిళా రైతులు

- ప్రభుత్వ ప్రోత్సాహం లేకున్నా సాగుపై మక్కువ చూపుతున్న అన్నదాత
- వరి, అపరాలు, మిరప, చెరకు పనుల్లో నిమగ్నం

గార: ఈ ఏడాది రబీలో అంచనా లక్ష్యం కంటే ఎక్కువగానే రైతులు సాగు చేస్తున్నారు. మొక్కజొన్న గతేడాది కంటే 30 శాతం అధికమని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రామచంద్రాపురం, వాడాడ, గొంటి, అంపోలు, శ్రీకూర్మం, సతివాడ, సైరిగాం పంచాయతీల్లో అపరాల పంట కోతకు వచ్చింది. ఖరీఫ్ రబీ పంట గతేడాది డిసెంబర్‌లో కురిసిన అకాల వర్షాల వల్ల పాడైంది. ఫలితంగా దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. శాలిహుండం, పూసర్లపాడు, బూరవిల్లి, గార, వమరవిల్లి, బోరవానిపేట, అంబళ్లవలస తదితర పంచాయతీల్లో వరి పంట సాగవుతోంది. దమ్ము పెట్టి ఉభాలు జరుగుతున్నాయి. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వలేదు. అయినా రైతులు అప్పులు చేసి వ్యవసాయ పనులు చేస్తున్నారు. కనీసం ఎరువులు, విత్తనాలు, సమయానికి 9 గంటల త్రీఫేజ్ విద్యుత్, ప్రస్తుత చీడపీడలపై అవగాహన కార్యక్రమాలైనా సమయానికి అందించాలని రైతులు కోరుతున్నారు. ఉపాధి హామీ పనులకు కొంత వెసులుబాటు ఇవ్వాలని మహిళా రైతులు కోరుతున్నారు.


శాలిహుండం సమీపంలో దమ్ము చేస్తున్న ట్రాక్టర్

25న షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం పంచాయతీ లింగాలపేట సమీపంలోని సాయినగర్ షిర్డీ సాయి ఆలయం వార్షికోత్సవం ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త, ట్రస్ట్ చైర్మన్ సనపల బాలకృష్ణ సోమవారం తెలిపారు. ఉదయం 5.15 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

20న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

రణస్థలం: రణస్థలం సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఈ నెల 20న విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ కార్యదర్శి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జి.సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, పైడిభీమవరం ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ల పరిధిలోని ఉన్న వినియోగదారులు హాజరై సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు బి.సులేఖరాణి, అకౌంటెంట్ సభ్యులు షేక్ బాబర్ హాజరవుతారని తెలిపారు.

రిమ్స్ అన్నపూర్ణ పథకానికి విరాళం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యదాన అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద వితరణకు సోమవారం ఆమదాలవలసకు చెందిన పొడుగు రంగారావు తన కుమారుడు మురళీ జ్ఞాపకార్థం రూ.15వేలు విరాళంగా అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. దాతలను రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, రిమ్స్ అన్నపూర్ణ అధ్యక్షుడు గంగుల రమణబాబు, సెక్రటరీ కిల్లాన ఫల్గుణరావు, జోనల్ కన్వీనర్ శివన్నారాయణలు అభినందించారు.

సోషల్ వర్క్ విద్యార్థికి డాక్టరేట్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోషల్ వర్కు విభాగం విద్యార్థి పాగిరి కృష్ణంనాయుడుకు వీసీ రజిని సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. గైడ్‌గా ప్రిన్సిపాల్ ఎం.అనురాధ వ్యవహరించారు. సోషల్ వర్కు బోర్డాఫ్ స్టడీస్ విభాగం చైర్మన్ పి.అర్జున్ వైవా వాయిస్ నిర్వహించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలు–మహిళా సాధికారిత అన్న అంశంపై కృష్ణంనాయుడు పరిశోధన పత్రాలు సమర్పించారు.

పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యం

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యమిస్తున్నట్లు సంత సీతారాంపురంలోని సైక్ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి తెలిపారు. కళాశాలకు ఐకార్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ ఇండ్ రీసెర్చ్ సంస్థ) గుర్తింపు వచ్చిన నేపథ్యంలో సోమవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని కలిశారు. భవిష్యత్తులో పీజీ కోర్సులు ప్రారంభిస్తామని, ఏజీ బీఎస్సీ సీట్లు పెరగనున్నాయని తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా గురుగుబెల్లి

శ్రీకాకుళం అర్బన్: బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన గురుగుబెల్లి దామోదరరావు ఎన్నికయ్యారు. ఎం.వి. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీఆర్‌పీఎఫ్), బాలల పరిరక్షణ వేదిక ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి ధనశ్రీ ప్రకాష్ నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఆదివారం విజయవాడలో రాష్ట్ర డెమొక్రటిక్ పీఆర్‌టీయూ టీచర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రకటించారని దామోదరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేయనున్నట్లు చెప్పారు.

రండి బాబూ రండి



జి.సిగడాం తహసీల్దార్, ఎంపీడీఓ, ఐకేపీ కార్యాలయాల ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలను విక్రయించారు. జగన్నాథవలస, సర్వేశ్వరపురం, మెట్టవలస జి.సిగడాం గ్రామాల్లో జీవామృతాలు, నీమాస్త్రం, కషాయాలను వినియోగించి వీటిని సాగు చేశారు.కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి బూరాడ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

– జి.సిగడాం

రహదారి ఇలా..రాకపోకలెలా?



జాతీయ రహదారిలో కేశవరావుపేట పంచాయతీ నుంచి ఎస్ఎంపురం, పిల్లలవలస, ధర్మవరం గ్రామాల మీదుగా వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. రాళ్లు తేలడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

నూకాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



నగరంలో నూకాలమ్మతల్లి అమ్మవారి ఆలయ పంచమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ముగ్గులతో చల్లదనం చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన, మల్లెమొగ్గల లక్ష్మీ బృందం భక్తి సంగీత విభావరి జరిగాయి. నక్కవీధి, దేశెల్ల వీధి, కుందనపువీధి భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆ ఐదు గ్రామాలకు నీరొచ్చింది

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని జల్లపేట, అనుబంధంగా ఉన్న మంగువారిపేట, కోనప్పగారిపేట, ముద్దాడపేట, గాబువానిపేటలకు ఎట్టకేలకు తాగునీటి సమస్య వీడింది. 'జల్లపేటలో తాగునీటికి కటకట' అనే శీర్షికన సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి పంచాయతీ ఈవో కె.ఈశ్వరమ్మ స్పందించారు. పంపు ఆపరేటర్ గోరు భాస్కరరావు, పల్ల రాజారావులను పంపించి మోటారుకు మరమ్మతు చేయించి ఫ్లషింగ్ చేయించారు. దీంతో ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా పునరుద్ధరణ జరిగింది.


మోటారు బిగిస్తున్న పంచాయతీ పంపు ఆపరేటర్లు

సూపర్‌సిక్స్ హామీలు అమలయ్యేదెన్నడు?

జి.సిగడాం: ఎన్నికల ముందుకు కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా వదిలేసి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి ధ్వజమెత్తారు.

సోమవారం దవళపేటలో సర్పంచ్ వడిశ మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా హామీలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల పక్షాన పోరాటేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పేడాడ శ్రీనివాసరావు, నాయకులు కంచరాన రామ్మోహన్, పేడాడ నారాయణరావు, చింతాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీరామమూర్తి

మెజారిటీ కేసులు రాజీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి భాస్కరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో మెజారిటీ కేసులు రాజీ చేయాలని జిల్లా అదనపు న్యాయమూర్తి పి.భాస్కరరావు అన్నారు. సోమవారం బార్ అసోషియేషన్ కార్యాలయంలో కేసుల రాజీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాలత్‌లో కేసుల పరిష్కారం వల్ల కక్షిదారులకు మేలు జరుగుతోందన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఫణికుమార్, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఆర్.సన్యాసినాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎం.అన్నంనాయుడు, సెక్రటరీ ప్రసన్నకుమార్, న్యాయవాదులు ఆగూరి ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఎన్ని సూర్యారావు, గేదెల వాసుదేవరావు, పి.మల్లిబాబు, రమణ, శిస్టు రమేష్, పొన్నాడ వెంకటరమణ, మెట్ట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.